# 'నేను దేహము కాదు, దేహిని'

ప్రేమస్వరూపులారా! ఈ జగత్తునందు సమస్త జీవులూ భగవత్ సంకల్పముచేతనే ఆవిర్భవిస్తున్నారు. భగవంతుడు తానే ఈ జగత్తును పోషించి, చివరికి తనయందే లీనము గావించుకుంటున్నాడు. భగవత్సంకల్పముచే ఆవిర్భవించిన ఈ జగత్తునకు 'విశ్వము' అని పేరు. తనంతట తాను వ్యాప్తి గావించుకోవడం దీని లక్షణం. విశ్వమనగా కేవలం భౌతికమైన పదార్థములతో ఏర్పడినది కాదు. విశ్వమంతయు భగవంతుని అవయవముల యొక్క చేరికయే! భగవంతుని ప్రతిబింబమే విశ్వము. 'వి' అనగా వివేకముగా, విస్తారముగా ఉండే తత్త్వము. విష్ణువనగా విశ్వస్వరూపమును పొందినవాడు. కాబట్టి, విశ్వము వేరు, విష్ణువు వేరు కాదు. ఐతే, ఈ విశ్వమును భగవంతుడు ఏవిధమైన లక్ష్యంతో, ఏవిధమైన సంకల్పంతో, ఏవిధమైన కారణంతో సృష్టించాడో మానవుడు దానికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాడు.

ఈ ప్రపంచంలో ప్రతి పదార్థమూ సత్, చిత్, ఆనంద, రూప, నామములనే ఐదు అంశములచే ఏర్పడుతూవచ్చింది. సచ్చిదానందము నిత్యసత్యమైనటు వంటిది; రూపనామములు కల్పితమైనవి. కాని, మానవుడు రాజసిక, తామసిక భావములతో కప్పబడడంచేత నిత్యసత్యమైన సచ్చిదానందమును విస్మరించి, అనిత్యమైన, అసత్యమైన రూపనామములను ఆధారము చేసుకొని తన జీవితము గడుపుతున్నాడు. ఏతావాతా, భగవంతుని శక్తినే తాను విస్మరిస్తున్నాడు. ఐతే, భగవంతునియొక్క తత్త్వమును అర్థము చేసుకోవడం అందరికీ సాధ్యం కాదు. భగవంతుడు ఉలిని ఉపయోగించని శిల్పి; కుంచె, రంగులు ఉపయోగించని అద్భుత చిత్రకారుడు. ఆధారము లేని గోళముపై భగవంతుడు చిత్రించిన చిత్రమే ఈ ప్రపంచము. భగవంతుడే అన్నింటికీ ఆధారము. భగవంతుడు నాభియందు సర్వసంకల్పములను ఆవిర్భవింపజేసుకోవడంచేత అతనికి 'పద్మనాభుడు' అని పేరు. అంతేకాక, తన గర్భమునందు హిరణ్యమును ఉంచుకోవడంచేత అతనికి

sri sathyasai vachanamrutam

'హిరణ్యగర్భుడు' అని పేరు. సర్వమానవులందు 'నేను, నేను' అనే అభిమానముతో తాను సంచరించడంచేత అతనికి 'స్వాస్థుడు' అని పేరు. అయితే, ఈ పేర్లన్నీ మానవుడు పెట్టినవేగాని, భగవంతుడు తనకు తాను పెట్టుకున్నవి కావు. ఈ పదములకు సరియైన అర్థములను గుర్తించవలెనన్న ఆధ్యాత్మిక తత్త్వములో ప్రవేశించాలి. ఆధ్యాత్మికమంటే ఏవో పూజలు చేయడం, వ్రతాలు చేయడం, అని భావించడం చాలా పొరపాటు. ప్రతి మానవుడు భగవంతునియొక్క అంశమేనన్న సత్యాన్ని గుర్తించి వర్తించాలి. ఇదే ఆధ్యాత్మికము. ఇదే భగవద్గీత యందు పేర్కొనబడిన "మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః", "వాసుదేవ సర్వ మిదం" అనే మహావాక్యములకు అర్థము. ఆత్మ అనేదానికి, బ్రహ్మ అనేదానికి భేదము లేదు. ఆత్మస్వరూపమే బ్రహ్మస్వరూపము. ఆత్మస్వరూపమనగా హృదయ మందున్న చైతన్యతత్త్వమే. ప్రతి మానవునియందు చైతన్యశక్తి ఉంటున్నది. ఆ చైతన్యశక్తి లేక మానవుడు బ్రతుకలేడు. అది నిత్యానందమయము, పరమానందమయము, యోగానందమయము, అద్వైతానందమయము.

**'ధర్మక్షేత్ర' నిర్మాణానికి ఇందులాల్‌షాయే కారకుడు**

1968లో బొంబాయిలో శ్రీసత్యసాయి సేవాసంస్థల ప్రథమ ప్రపంచ సమ్మేళనం జరిగినప్పుడు అక్కడ 'ధర్మక్షేత్ర' అనే ఉత్తమమైన పేరుతో ఒక ఆధ్యాత్మిక కేంద్రమునకు ప్రారంభోత్సవం జరిగింది. 'ధర్మక్షేత్ర' నిర్మాణానికి ఇందులాల్‌షాయే మూలకారకుడు. స్వామి తత్త్వమును జగత్తులో వ్యాప్తి గావించడానికి ఆయన ఎంతో కృషి చేశాడు. సరళమ్మ (శ్రీ ఇందులాల్‌షా సతీమణి) ఆయనకు తోడుగా నిల్చి, శ్రీ సత్యసాయి సేవాసంస్థలలో బాలవికాస్, మహిళావిభాగ్‌వంటి అంగములను చేర్చి, వాటి అభివృద్ధికై కంకణం కట్టుకుంది. ఈవిధముగా ఇరువురూ కలసి సాయివైభవాన్ని ప్రపంచములో ఎంతయో వ్యాప్తి గావిస్తూ వచ్చారు. వయస్సు మీరినప్పటికీ ఇప్పటికికూడను వారు ఎంతో కష్టపడి అనేక కార్యక్రమాలు జరుపుతూ వస్తున్నారు. ఏదైనా గొప్ప కార్యము చేయవలెనన్న అందరి సహాయము లేకుండా వీలుకాదు. ప్రారంభములో అనేక ఆటంకములు ఎదురవుతుంటాయి. దేవ, దానవులు కలసి క్షీరసాగరమును మథించే సమయంలో

sri sathyasaivachanamrutam

ప్రప్రథమంగా విషమే వెలువడింది. కాని, వారు ఏమాత్రము వెరువక పట్టుపట్టి మథనమును కొనసాగించగా అమృతము ఆవిర్భవించింది. నిజానికి మన హృదయమే క్షీరసాగరము. మన పట్టుదలయే కవ్వము. మన సాధనయే చిలకడం. ఇట్టి సాధన చేస్తున్నప్పుడు ప్రారంభంలో కొన్ని కష్టములు, నష్టములు వస్తాయి. వాటికి మనం వెరువక దానిని సాధించడానికి పట్టుపట్టాలి. అప్పుడే ఆనందమయమైన, అమృతమయమైన స్థానము మనకు లభిస్తుంది.

మన ప్రాచీనులు అనేక కష్టములకు, నష్టములకు ఓర్చుకొని భద్రాచలము, అమరనాథ్‌వంటి గొప్పగొప్ప పుణ్యక్షేత్రములను నిర్మించారు. శంకరాచార్యుల వారు అనేక శ్రమలకోర్చి బదరీనాథ్, కేదారనాథ్ మున్నగు క్షేత్రములకు నడచిపోయి దిగ్విజయము గావించారు. ప్రతి క్షేత్రమునకు ఒక చరిత్ర ఉన్నది. అట్లే, 'ధర్మక్షేత్ర'కు కూడా ఒక చరిత్ర లేకపోలేదు. 'ధర్మక్షేత్ర'ను నిర్మించే ప్రయత్నంలో ఇందులాల్‌షా ఎన్ని శ్రమలు పడ్డాడో స్వామికే తెలుసు. అక్కడికి వెళ్ళడానికి ఏ మార్గమూ లేక, ఆ ప్రాంతమంతా ముళ్లపొదలతో, కంపలతో నిండి ఉండేది. అలాంటి ప్రదేశంలో తాను అడుగడుగూ స్వయంగా తిరిగి 'ధర్మక్షేత్ర' నిర్మాణానికి అనువైన ప్రదేశమును ఎంపిక చేసి నాకు చూపించాడు. అది 'మహాకాళీ కేవ్స్' రోడ్డును ఆనుకొని ఉన్నది. తాను ఎంతో కష్టపడి పనిచేసి, అనేకమంది సహకారంతో 'ధర్మక్షేత్ర' నిర్మాణమును పూర్తి చేశాడు. ఎవరైనా సరే, ఇట్టి బృహత్తరమైన కార్యమును చేయవలసివచ్చినప్పుడు అందరి సహకారమును అందుకోవలసివస్తుంది. ఐకమత్యమువల్లనే ఆనందానికి నోచుకోగల్గుతాము. కాని, ఈ కలియుగంలో ఐకమత్యము క్షీణించిపోయింది. 'యూనిటీ' (ఐకమత్యం) లేదు, 'ప్యూరిటీ' (పవిత్రత) లేదు. అందువల్ల, 'ఎనిమిటీ' (ద్వేషము) ప్రవేశించి కష్టములకు గురిచేస్తున్నది. కనుక, ఈనాడు ఐకమత్యము అత్యవసరం. ఐకమత్యమే మానవజీవితమునకు మహాబలము.

**మాటలు చెప్పనక్కర్లేదు, చేతల్లో చూపించాలి**

ఎట్టి సంకల్పమో అట్టి చర్య. ఎట్టి చర్యయో అట్టి ఫలము. ఎట్టి ఫలమో అట్టి గమ్యము.

sri sathyasaivachanamrutam

## తేదీ 13.07.2003, గురుపూర్ణిమ, సాయికుల్వంత్ సభామండపం

ఈనాడు మీరు గమ్యము చేరుకోలేకపోవడానికి కారణము మీ సంకల్పములు సక్రమమైనవిగా లేకపోవడమే. కొంతమంది 'దైవము, దైవము' అంటూ దైవమును ప్రేమిస్తున్నట్లుగా నటన చేస్తుంటారు. శారీరకమైన సంబంధమును కల్పించుకొని, ధనకనకవస్తువాహనాదులతో సంబంధము కలిగించుకొని అందరూ ప్రేమిస్తున్నారేగాని, అది కపటమైన ప్రేమ. నాకు ఎంతోమంది జాబులు వ్రాస్తుంటారు, "స్వామీ, మిమ్మల్ని ప్రేమిస్తున్నాము. కాబట్టి, మమ్మల్ని దరిచేర్చుకోండి," అని. సాయి అంత సులభంగా లభించేవాడు కాడు. మీరు ప్రేమిస్తున్నామని చెప్పినంతమాత్రాన నేను నమ్మడానికి వీలుకాదు. మీ ప్రేమ వెనుక ఏ త్యాగమున్నది? నేడు చెప్పిన మాట రేపు తప్పిపోతున్నారు. అలాంటి అసత్యవాదుల ప్రేమను ఎలా నమ్మడానికి వీలౌతుంది? సత్యనిత్యమైన ప్రేమ హృదయమునుండి ఆవిర్భవిస్తుంది. Heart to heart (హృదయము నుండి హృదయానికి) – ఇదే నిజమైన ప్రేమ. **"మాటలు చూస్తే కోటలు దాటుతాయి, కాలు చూస్తే గడప దాటదు."** ఇలాంటివారి మాటలు నమ్మి ప్రపంచంలో అనేక మంది అనేకరకాలుగా మోసపోతున్నారు. నిజంగా ప్రేమ ఉన్నవారు, నిజంగా హృదయమున్నవారు మాటలు చెప్పరు; ఆచరణలో నిరూపిస్తూ వస్తారు. కాని, ఈనాడు మాటలు మాత్రము అధికము, ఆచరణ శూన్యము! అటువంటివారు పక్కాదొంగలే తప్ప సరియైనవారు కారు. అలాంటి దొంగలను ఆశ్రయించి, వారిని నమ్ముకొని మనము గమ్యము చేరగలమా? భక్తులకు దృఢమైన విశ్వాసము, నిశ్చలమైన ప్రేమ ఉండాలి. చెప్పే మాటలు, చేసే చేతలు ఒకటిగా ఉండాలి. అలాంటి భక్తులపై స్వామి దయ ఎల్లప్పుడు ఉంటుంది. కాని, ఈనాడు కొంతమంది భక్తులమని చెప్పుకుంటూ కృత్రిమమైన మాటలచేత, కపటమైన ప్రేమచేత భగవంతుణ్ణికూడా మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అట్టివారికి భగవంతుడు ఎప్పటికీ చిక్కడు. మాటలు చెప్పనక్కర్లేదు. మీ హృదయాన్ని కరిగించుకొని భగవంతునివైపు ప్రవహింపజేయాలి. హృదయము కరిగి ప్రవహించినప్పుడే భగవంతుని హృదయానికి హత్తుకుంటుంది. మాటలు ఎన్నైనా చెప్పవచ్చును. కనుక, అలాంటివాటికి మనం లొంగకూడదు.

srisathyasaivachanamrutam

## తేదీ 13.07.2003, గురుపూర్ణిమ, సాయికుల్వంత్ సభామండపం

### ఎవరు నిజమైన భక్తుడు?

ఎంత కష్టమైనా, నష్టమైనా వెరువక మన హృదయస్థాయిని పట్టుకొని గమ్యాన్ని చేరుకోవాలి. కాని, ఈనాటి మానవునికి గమ్యాన్ని చేరాలనే సంకల్పమే లేదు. గమ్యమంటే ఏమిటో అర్థము కానివానికి చేరడం ఎట్లా సాధ్యమౌతుంది? ప్రేమ అనేది ఒక్కటేగాని, రెండు, మూడు తునకలు లేవు. మీ ప్రేమను ముక్కలు చేసి భగవంతునిపైన కొంత, లౌకికవిషయాలపైన కొంత ప్రసరింపజేస్తే, అది ప్రేమ ఎలా అవుతుంది? మన హృదయము ఒక్కటే. దానిని ముక్కలు చేసి ఒక్కొక్క మనిషికి కొంచెంకొంచెం ఇవ్వడానికి వీలౌతుందా? ముక్కలు చేయడానికి అది చెరకుగడ కాదు, లడ్డుముద్ద కాదు. హృదయము సత్యనిత్యమైనది; అమృత మయమైన ఆనందముతో నిండినది. ఇలాంటి హృదయాన్ని లౌకికమైన మార్గంలో ప్రవేశపెట్టి, ఇదే అమృతమయమని అనుకోవడం అజ్ఞానం కాదా? మనం కొన్ని కష్టములను, నష్టములను తట్టుకోవాలి, నెట్టుకుపోవాలి. కష్టనష్టములను తట్టుకొని నెట్టుకొని సాధించేవాడే భక్తుడు. నిజంగా భగవంతుని చేరాలనుకునే వారు పట్టుపట్టి, ఆ పట్టును సాధిస్తూ రావాలి.

**పట్టినదేదియో పట్టనే పట్టితివి**
**పట్టు నెగ్గెడుదాక అట్టెయుండు**
**కోరినదేదియో కోరనే కోరితివి**
**కోర్కె చెల్లెడుదాక కొలిచియుండు**
**అడిగినదేదియో అడుగనే అడిగితివి**
**అడిగినదిడుదాక విడువకుండు**
**తలచినదేదియో తలచనే తలచితివి**
**తలపు తీరెడుదాక తరలకుండు**
**పోరు పడలేక తానైన బ్రోవవలయు**
**ఒడలు తెలియక నీవైన అడుగవలయు**
**అంతియేకాని మధ్యలో ఆపివేసి**
**తిరిగిపోవుట భక్తుని దీక్ష కాదు**

sri sathyasai vachanamrutam

ఎంతటి ప్రమాదం సంభవించినప్పటికీ, ఎటువంటి కష్టములు కలిగినప్పటికీ తట్టుకొని నెట్టుకొని ముందుకు సాగిపోవాలి. భగవంతుడు కష్టములయందే మీకు లభిస్తాడు. 'కష్టే ఫలీ' అన్నారు. 'న సుఖాత్ లభ్యతే సుఖం.' కష్టములనుండియే మనకు సుఖము లభిస్తుంది. కాబట్టి, కష్టములు భగవంతుని వరప్రసాదములుగా మనం భావించాలి. ముఖ్యంగా భగవత్కార్యములలో ప్రవేశించినవారు కష్టములను, నష్టములను నెట్టుకొని రావాలి. ఇలాంటి కష్టములనెన్నింటినో తట్టుకొని నెట్టుకొని వచ్చారు ఇందులాల్‌షా, సరళమ్మ. వీరెక్కడ ఉంటున్నారో తెలుసా? బొంబాయిలో ఉంటున్నారు. బొంబాయి సామాన్యమైనది కాదు, ఒక బాంబు వంటిది! అక్కడ మంచి చేసినా కష్టమే, చెడ్డ చేసినా కష్టమే! అలాంటిచోట ఉంటూ అనేక కార్యక్రమాలను జరుపుతూ వచ్చారు. ఇందులాల్‌షాకు ఎందరో, ఎన్నోవిధాలుగా ఆటంకాలు కలిగిస్తూ వచ్చారు. కాని, ఆయన స్వామియందు అచంచల మైన భక్తితో అన్నింటినీ సాధిస్తూవచ్చాడు. నలభై సంవత్సరములనుండి ఆయన సాయిని పట్టిన పట్టు చాలా గట్టి పట్టు. ప్రపంచమంతటా సంచరిస్తూ సాయితత్త్వమును ప్రబోధిస్తూ వచ్చాడు. ఎవరే ప్రశ్నలు వేసినా చక్కని జవాబులిచ్చుకుంటూ వచ్చాడు. దేహాన్ని కూడా లెక్కచేయక ఎంతో శ్రమ పడి పనిచేస్తూ వచ్చాడు.

ఒక చిన్న విషయమును మీకు చెబుతున్నాను. పోయిన నెల స్వామి పడిపోయినాడని తెలుసుకొని ఆయన బెంగుళూరుకు వచ్చి నన్ను చూసివెళ్ళాడు. నేను మంచముపైనుండగా చూసి మనస్సులో చాలా బాధపడ్డాడు. అయితే, ఎవ్వరికీ చెప్పలేదు. స్వామిని గురించి లోలోపల తపనపడుతూ నిద్రాహారాలను విడిచిపెట్టాడు. తత్ఫలితంగా అతని దేహము బలహీనమైపోయింది. లేకపోతే, ఎప్పుడూ ఆరోగ్యాన్ని చెడుపుకునేవాడు కాదు. సాయిసంస్థల భవిష్యత్తుకు సంబంధించి తానెన్నో ప్లాన్లు వేశాడు. వాటిని ఆచరణలో పెట్టడానికి తగిన శక్తి స్వామి ఇవ్వాలని ప్రార్థిస్తున్నాడు. సరళమ్మ కూడా పైకి చెప్పలేదుగాని, లోలోపల చాలా బాధపడుతూ వచ్చింది. వారిరువురూ స్వామి విషయమే ఎక్కువగా ఆలోచిస్తూ వచ్చారు. ఎవరు చెప్పినా వారు నమ్మరు. ఒకరి నమ్మకాన్ని వారు ఆశ్రయించలేదు. వారి నమ్మకమే వారిది.

sri sathyasai vahanamrutam

**'భక్తులు చేసిన ప్రార్థనలే నా ఔషధము'**

ఐతే, స్వామి విషయంలో ఎవ్వరూ ఏవిధంగాను యోచించనక్కర్లేదు. స్వామికి ఎట్టి ప్రమాదములూ ఉండవు. ఎన్ని రకములైన కష్టములు, నష్టములు వచ్చినా తట్టుకొని నెట్టుకొని వచ్చేవాడు స్వామి. కనుక, ఎవ్వరూ బాధపడనక్కర్లేదు. స్వామియే అన్నింటినీ సాధించుకుంటూ వస్తాడు. ఏదో లౌకికమైన దేహముతో, లౌకికమైన ఆహారముతో కొన్ని మార్పులు జరుగవచ్చు. అవి తాత్కాలికమైనవే గాని, శాశ్వతమైనవి కావు. కనుక, మీరు ధైర్యంగా ఉండాలని నేను ఆశిస్తున్నాను. ఈ దేహానికి వచ్చిన ఇబ్బందులన్నీ తొలగిపోయి నేను ఈనాడు మీ ముందు నిలిచి మాట్లాడుతున్నానంటే, ఏది ఔషధము? భక్తులు చేసిన ప్రార్థనలే నా ఔషధము. ఈ ఒక్క నెలలో మద్రాసు, బొంబాయి, హైదరాబాదు, బెంగుళూరు, ఇంకా అనేకచోట్ల భక్తులు ఎంతో భక్తిప్రపత్తులతో ఇంటింటియందు భజనలు, నామస్మరణలు, వ్రతాలు మొదలైన సాధనలను అధికంగా చేసుకుంటూ వచ్చారు. వారు చేసిన ప్రార్థనల ఫలితమే నేనీనాడు మీ ముందు నిల్చుకొని మాట్లాడడానికి దోహద చేసింది. ఈ దేహమునకు బాధ కావాలనిగాని, పోవాలనిగాని నేను ఆశించలేదు. స్వామికి బాధ నివారణ కావాలని ఆశించింది మీరే. మీరు ఆశించింది మీరే కాపాడుకుంటూ వచ్చారు. ఈ దేహం నాది కాదు, ఈ దేహము మీదే. మీ దేహాన్ని మీరు చూసుకోవలసిందే. నేను దేహము కాదు, దేహిని.

దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు, గణుతింపగ దేహికి చావు పుట్టుకల్
మోహనిబంధ బంధనలు ముద్రలు లేవు నిజంబు చూడ యా
దేహియె దేవదేవుడు, మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!

ఆత్మకు చావుపుట్టుకలు లేవు; ఎట్టి బాధలూ, ఎట్టి కష్టములూ లేవు. చెబితే మీరు నమ్మరేమోగాని, ఈ దేహానికి కలిగిన బాధను డాక్టర్లు ప్రత్యక్షంగా చూశారు. ఇట్లా జరిగినదానికి సాధారణంగా ఎవరికైనా కనీసం మూడేళ్ళు సరిగా నడవడానికి వీలుకాదు. తుంటిఎముకలు జాయింట్‌గా ఉండడానికి ఒక బాల్ ఉంటుంది. అది ముక్కలైపోయింది. నా శరీరంలో కండలు లేవు. కాని, నా ఎముకలు చూద్దామా అంటే, అవి వజ్రాల మాదిరి

ఉన్నాయి. వాటిని అతిక్రమించడానికి ఏమాత్రం వీల్లేకపోయింది. కాబట్టి, 'రాడ్' వేసి ఆపరేషన్ చేశారు. ఈవిధంగా చేసిన తరువాత చాలాకాలం వరకు నడవడానికి వీలుకాదు. కాని, నేను దీన్నంతా లెక్కచేయలేదు. ఈ దేహాన్ని రక్షించుకునే నిమిత్తం డాక్టర్లు ఏమేమో చేశారు. అది వారి కర్తవ్యం. కాని, నేను ఏమాత్రం ఆసక్తి చూపలేదు. నా ఆదర్శాన్ని మీకందించే నిమిత్తం ఇదంతా చేశాను. ఇప్పుడే కాదు, గత రెండు సంవత్సరాలనుండి దేహాభిమానం తగ్గించుకొమ్మని, ఆత్మాభిమానం పెంచుకొమ్మని మీకు బోధనలు చేస్తూనే ఉన్నాను. మీరు ఆత్మస్వరూపులేగాని, దేహ స్వరూపులు కారు. బాధలు దేహానికి ఉంటాయి గాని, ఆత్మకు ఉండవు.

**'మీబోటి భక్తుల ప్రేమతత్త్వమే నా బలము'**

కాలు కదిలించడానికి వీలుకాని పరిస్థితి ఏర్పడింది ఈ దేహానికి. కదిలిస్తే 'షాకు' మాదిరి తగిలింది. అయినప్పటికీ నేను డాక్టర్లకు చెప్పాను, "ఈ దేహము నాది కాదు. ఇది మీ దేహము. దీనిని మీరేమైనా చేసుకోండి." ఈవిధముగా దేహాభిమానమును త్యాగము చేసినవారికి ఎట్టి బాధలూ ఉండవు. ఇక్కడొక చిన్న విషయం చెప్పాలి. ఆపరేషను రూములోకి సాధారణంగా డాక్టర్లను తప్ప వేరెవ్వరినీ అనుమతించరు. కాని, ఏమైనా సరే, తాను స్వామివెంట ఉండాలి, స్వామిని చూసుకోవాలి అనే పట్టుదలతో సత్యజిత్ నావెంట వచ్చాడు. వ్యానులో నన్ను హాస్పిటల్‌కి తీసుకొనిపోతుంటే నా తలదగ్గర కూర్చున్నాడు. ఆపరేషను రూములోకి తానుకూడా ప్రవేశించాడు. డాక్టర్లు వేసుకునే డ్రస్సు తాను కూడా వేసుకొని కూర్చున్నాడు. 'సత్యజిత్, నీవు రక్తము చూస్తే భరించుకోలేవు. కాబట్టి, నీవిక్కడ ఉండవద్దు, బయటికి పో,' అని చెప్పాను. కాని, అతను స్వామిదగ్గరే ఉంటానని గట్టిగా పట్టుపట్టి అక్కడే కూర్చున్నాడు. ఇక, ఆపరేషను రూములో డాక్టర్లు సుత్తితో నా ఎముకలను కొడుతున్నారు. అది కూడా చిన్న సుత్తి కాదు, పెద్ద సుత్తి! మొల తీసుకొని ఎముకలో రంధ్రము వేయడానికి కొడుతున్నారు. కాని, సత్యజిత్ బెదరలేదు. డాక్టర్లు ఏమి చేస్తారో చూడాలని అక్కడే కూర్చున్నాడు. చేసినారు. అంతా అయిన తరువాత, 'స్వామీ, ఇంత బాధను మీరెట్లా భరించుకున్నారు?' అని అడిగాడు. 'మీబోటి భక్తుల ప్రేమతత్త్వమే నా బలము,' అని నేను సమాధానం చెప్పాను. ప్రేమతత్త్వమే సర్వబలములకు మూలాధారము.



srisathyasaivachanamrutam

స్వామి త్వరగా కోలుకోవాలని ఎందరో భక్తులు వారివారి గ్రామాలలో విడువకుండా భజనలు, వ్రతాలు చేస్తూ వచ్చారు. 'మా స్వామికి త్వరగా బాగైపోవాలి, మా స్వామి బయటికి రావాలి, మా స్వామి ఆరోగ్యంగా ఉండాలి,' ఇదే వారి ప్రార్థన. నాకు కొన్ని వేలు, లక్షల ఫోన్లు, టెలిగ్రామ్‌లు వచ్చాయి. ఇంకా అనేకమంది భక్తులు లోలోపల చాలా తపనచెందుతూ వచ్చారు. వారి తపనయే తపస్సుగా మారిపోయింది. ఆ తపఃఫలమే స్వామియొక్క ఆరోగ్యమునకు మూల కారణం. ఇప్పుడు నేనింత ఆనందంగా ఉన్నానంటే, దీనికి కారణం వారందరి భక్తిప్రపత్తులే! నా దైవశక్తిని నేను ఏమాత్రం ఉపయోగపెట్టుకోలేదు. నేను ఉపయోగ పెట్టుకుంటే ఒక్క క్షణంలో బాగైపోవచ్చు. కాని, 'నాకు బాగైపోవాలి,' అనే స్వార్థచింతన నాలో ఏనాడూ లేదు. అందరూ ఆనందంగా ఉండాలి. అందరూ సుఖాన్ని అనుభవించాలి – ఇదే మన భారతీయసంస్కృతియొక్క ప్రధానమైన లక్ష్యము.

**యువతకు ఆదర్శప్రాయులు - సత్యజిత్, దిలీప్**

ఈ కలియుగప్రభావమువలన విద్యావంతులకు, అందులో ముఖ్యంగా యువకులకు భగవత్తత్త్వముపట్ల అనేక 'డౌట్స్' (సందేహాలు) కల్గుతుంటాయి. కాని, సత్యజిత్ మరియు దిలీప్ – ఈ ఇద్దరు పిల్లలు నాయందు అచంచలమైన విశ్వాసముతో, భక్తిశ్రద్ధలతో నాకు సేవ చేస్తూ వచ్చారు. ఈ కలియుగమునందు, ఈ వయస్సులో ఇన్ని చదువులు చదివి, ఎమ్.ఎస్‌సి., ఎమ్.బి.ఎ. వంటి ఉన్నతమైన డిగ్రీలు పొంది, అంతటి దృఢమైన విశ్వాసము కలిగి ఉండడం చాలా అరుదైన విషయం. వేళ కాని వేళలో రాత్రి ఏ ఒంటిగంటకో, ఒంటి గంటన్నరకో నేను లేచి కనులు తెరచి చూస్తే ఒకరు పాదాలదగ్గర, ఒకరు తలదగ్గర కూర్చుని నన్ను కనిపెట్టుకొని ఉండేవారు. అంత ప్రేమతో ఈ దేహాన్ని కాపాడుతూ వచ్చారు. వారికి నిద్రాహారములే లేవు. వేళ కాని వేళలో 'సత్యా' అని నేను చిన్నగా పిలిస్తే చాలు, అతను రక్కున లేచి అన్నివిధాలుగా సేవ చేసేవాడు. దిలీప్ ఇక్కడి హాస్పిటల్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి ఈమధ్యనే కాలు విరిగింది. ఆ విరిగిన కాలికి బ్యాండేజి కట్టుకుని స్వామికి సేవచేసే నిమిత్తం బెంగుళూరుకి వచ్చాడు. వీరిద్దరూ చాలా గొప్ప సేవ చేశారు. వీరు చేసిన సేవ వేరెవ్వరూ చేయలేరని నేను గట్టిగా చెప్పగలను. అందరూ 'ప్రేమ, ప్రేమ...'

srisathyasaivachanamrutam

అని మాట్లాడగలరేగాని, అట్టి సేవలు ఎవ్వరూ చేయలేరు. నా ఆహార విహారములన్నీ వారే చూసుకునేవారు. ఈ నెలరోజులూ వారు తమ జీవితాన్నే పూర్తిగా మరచిపోయారు. నిజంగా వారి తల్లిదండ్రులు చేసిన పుణ్యఫలమే ఇదంతా! వారు చేసిన పుణ్యమువలననే వీరిలో ఇంత గొప్ప భావము కలుగుతూ వచ్చింది. కనుక, తల్లిదండ్రులు భగవద్భక్తులుగా ఉండాలి. వారి భక్తిభావమే వీరి ఉత్సాహమునకు కారణమైంది. నేను అప్పుడప్పుడు, 'మీరు భోజనానికి పోండి. స్వామి బాగున్నాడు,' అని చెప్పేవాడిని. అయినప్పటికీ వారు స్వామిని విడిచి వెళ్ళేవారు కాదు. స్వామి ఆరోగ్యం గురించి ఎవరైనా ఫోను చేస్తే, "స్వామి బాగున్నారు," అని చెప్పి ఫోను పెట్టేసేవారు. అంతేగాని, ఏ వివరాలూ చెప్పేవారు కాదు. మంచి మాటలచేత అందరికీ ఎంతో ఉత్సాహం కలిగించారు. దీనికి చదువులు కాదు ప్రధానము, వయస్సు కాదు ప్రధానము. ఆత్మతత్త్వమునందు విశ్వాసమే ప్రధానము. అదియే నిజమైన ప్రమాణము. ఆ ప్రమాణమును ఆధారం చేసుకొనియే వారు స్వామిసేవ చేస్తూ వచ్చారు. అవకాశము ఇస్తే చేసేవారు ఎంతోమంది ఉన్నారు. కాని, అందరికీ అట్టి అవకాశము చిక్కదు. చిక్కిన అవకాశమును దక్కించుకొని సార్థకము చేసుకున్నారు వీరు. దీనికంటే గొప్ప సాధన మరొకటి లేదు. స్వామిసేవ చేసుకోవడం, ఈ ప్రేమతత్త్వాన్ని స్వామి చూడడం... ఇంతకంటే ఏమి కావాలి? ఈవిధంగా నెల దినములు ఇంత కష్టపడి సేవచేసేవారు ఈ జగత్తులో ఈ వయస్సులో చిక్కరు. ఆ ఇద్దరు చేసిన సేవవల్లనే నేను ఈనాడు మీ ముందు నిలిచి మాట్లాడగల్గుతున్నాను. ఎవరియందూ లేని శ్రద్ధ, భక్తి, పట్టుదల వారిలో నేను చూశాను. కనుకనే, నన్ను వారు వశము చేసుకోగలిగారు. వారి భక్తిప్రపత్తులే నేను వారికి వశము కావడానికి కారణము. ఇలాంటి భక్తిప్రపత్తులను పెంపొందించుకుంటే మీరుకూడా ఎంతైనా సాధించ గలరు; పర్వతాలను సహితం మోయగలరు. రామరావణయుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛిల్లినప్పుడు సంజీవని మూలిక కావలసివచ్చింది. దానిని తెచ్చే నిమిత్తం హనుమంతుడు వెళ్ళాడు. కాని, సంజీవని ఎలా ఉంటుందో అతనికి తెలియదు. అందుచేత, ఏకంగా సంజీవని గల పర్వతాన్నే తీసుకువచ్చి రాముని ముందు ఉంచాడు. దానిప్రభావముచేత లక్ష్మణుడు మూర్ఛనుండి తేరుకున్నాడు. భగవద్భక్తుడు హనుమంతునివలె దేనికైనా సిద్ధంగా ఉండాలి. ఈనాటి భక్తులు కష్టమంటే

వెనక్కి పరుగెత్తుతారు, సుఖమంటే ముందుకు తోసుకొని వస్తారు. అట్లా కాదు, దేనికైనా సిద్ధంగా ఉండాలి. దేహమును ధరించిన తరువాత ఎవరికైనా కష్టాలు తప్పవు. వాటిని లెక్కచేయకూడదు. భగవద్విశ్వాసాన్ని దృఢంగా పెట్టుకోవాలి. విశ్వాసమే మీ శ్వాసగా భావించాలి.

ఇంకా ఒక విషయము చెప్పాలి. గీతారెడ్డి మంచి పదవిలో ఉన్న వ్యక్తి. తనకు ఎన్ని ముఖ్యమైన పనులున్నప్పటికీ ఆమె వాటన్నింటినీ విడిచిపెట్టి, 'స్వామి బాగుండాలి, స్వామి క్షేమం చూడాలి' అనే తపనతో ఒక నెలరోజులపాటు డబ్బుకు కూడా లెక్కచేయకుండా హైదరాబాదు నుండి బెంగుళూరుకు ప్లేనులో వచ్చి వెళుతూ ఉండేది. పది, పదిహేను దినములు ఆమె బృందావనంలోనే కూర్చుంది. అయితే, స్వామిని చూడడానికి లోపలికి ఎవ్వరినీ వదల్లేదు. నేను కూడా మాట్లాడించలేదు. ఆమె బయటనే ఉండి స్వామియొక్క క్షేమసమాచారమును తెలుసుకుంటూ ఉండేది. ఆ నెలరోజులూ హైదరాబాదును పూర్తిగా మరచి పోయింది. ఆమె గతంలో మినిష్టరుగా పని చేసింది; ఈనాడు కాంగ్రెసులో రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు. కాని, 'ఇవన్నీ నాకక్కర్లేదు. స్వామి కావాలి. స్వామి క్షేమంగా ఉండాలి,' అని నిరంతరం స్వామి చింతనలో ఉండిపోయింది. స్వామి ఆరోగ్యముగురించి మనస్సులో చాలా బాధ పడుతూ వచ్చింది. నిజంగా అంత ప్రేమతో స్వామి గురించి బాధపడినవారు ఎంతోమంది ఉన్నారు. వారి ఇళ్లలో బాధలున్నప్పటికీ లెక్కచేయక స్వామిని ప్రాణసమానంగా చూసుకున్నారు. అదే నిజమైన భక్తి. వారందరి భక్తిప్రపత్తులే స్వామి తొందరగా కోలుకోవడానికి దోహదం చేశాయి. అటువంటి భక్తిప్రపత్తులను పెంచుకోండి. దానివలన ఎటువంటి బాధలైనా తప్పక నివారణ అవుతాయి.

ఇంకొక చిన్న విషయం. అమెరికానుండి ఒక క్యాన్సరు పేషంటు తన భర్తతో కలసి బెంగుళూరుకు వచ్చింది. ఆమెకు హార్టు దగ్గర క్యాన్సరు వచ్చింది. డాక్టర్లు క్యాన్సరని చెప్పేసరికి ఆమె చాలా భయపడిపోయింది. నేను ఆమెతో, 'క్యాన్సరుకు భయపడవద్దు. నేను క్యాన్సిల్ చేస్తాను,' అని చెప్పి, ఆవిధంగా చేసి ఒక వారం రోజులు ట్రీట్‌మెంటు ఇప్పించేసరికి అంతా నయమైపోయింది. పైభాగంలో మాత్రం కొంచెం ఉంటే దానిని తీసివేయమని డాక్టర్లకు చెప్పాను. నేను బెంగుళూరునుండి ఇక్కడికి వచ్చిన దినమే ఆమెకు

sri sathyasai vahini

ఆపరేషను జరిగింది. రెండవ దినమే ఆమె చక్కగా నడుచుకుంటూ వెళ్ళింది. ఇప్పుడు మంచి ఆరోగ్యంతో ఉన్నది. దీనికి కారణం భగవన్నామమే! 'సాయిరాం, సాయిరాం' అంటూ ఆమె నిరంతరం నామస్మరణ చేస్తూ ఉంటుంది. ఇలాంటివి ఎన్నో వ్యాధులు, డాక్టర్లకు సాధ్యం కానివి, నివారణ అవుతున్నాయి. ఈవిధంగా ఎంతోమందికి నేను ఉపకారము చేయడంవలన అందరూ నా నిమిత్తమై బాధపడుతూ వచ్చారు. వారు చేసిన ప్రార్థనవల్లనే నాకింత త్వరగా నయమైపోయింది.

ఇంతేకాదు. నా ఎడమకంటిలో దృష్టి పోయి తొమ్మిది సంవత్సరాలైంది. ఇంతకాలం నేను ఒకే కంటితో చూస్తూ వచ్చాను. "స్వామీ, ఈ కన్ను కూడా సరి చేసుకుంటే మంచిది," అని నరసింహమూర్తి, డాక్టర్లుకూడా నన్ను ప్రార్థించారు. "నేను ఒక కంటితో అన్నింటినీ చూస్తున్నాను కదా! రెండవ కన్ను ఎందుకు? ప్రపంచాన్ని చూడడానికి రెండు కన్నులు కావలెనా? నాకక్కర్లేదు," అని చెప్పాను. కాని, డాక్టర్లు పట్టుపట్టి కాలికి ఆపరేషను అయినప్పుడు కంటికి కూడా ఆపరేషను చేశారు.

**"ఎందరో మహానుభావులు..."**

ఈరోజు నేను, భక్తులకు దర్శనం ఇవ్వడానికి ఉదయం ఏడు గంటలకు పోదామంటే సత్యజిత్, "స్వామీ, మీకు శ్రమ అవుతుంది. ఏడున్నరకు పోదాము,' అని చాలా ప్రార్థించాడు. ఈవిధంగా, అడుగడుగునా అతడు నా క్షేమాన్ని కోరుతూ వస్తున్నాడు. ఇలాంటి భక్తులు ఈ లోకంలో ఎంతమందో ఉన్నారు. కనుకనే, త్యాగరాజు 'ఎందరో మహానుభావులు...' అని గానం చేశాడు. అలాంటివారు ఉండబట్టే ఈనాటికీ భారతదేశము క్షేమంగా ఉండగలుగుతోంది. భారతదేశము కేవలం మట్టిముద్ద కాదు; ప్రపంచానికి గుండెవంటిది. భారత దేశము బాగుంటే అన్ని దేశములూ క్షేమంగా ఉంటాయి. కాని, ఈ సత్యాన్ని భారతీయులే గుర్తించక స్వార్థపూరితమైన జీవితాన్ని గడుపుతున్నారు. మొట్టమొదట మీరు స్వార్థమును మానుకొని పరోపకారసంబంధమైన కార్యములలో పాల్గొనండి. అందరి క్షేమమును కోరుతూ రండి. "సమస్త లోకాః సుఖినో భవంతు" అని హృదయ పూర్వకంగా ప్రార్థించండి. అప్పుడే మీరు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతారు.

sri sathyasaivachanamrutam

చాలా టైమ్ తీసుకుని మిమ్మల్నందరినీ శ్రమపెట్టాను. మీరందరూ ఆనందంగా ఉంటూ, సేవలలో పాల్గొంటూ మిగతావారికికూడా సేవా భావమును బోధించాలని నేను ఆశిస్తున్నాను. ఇందులాల్‌షా, సరళమ్మ చేసినట్లుగానే సత్యసాయి బాలవికాస్, సత్యసాయి మహిళా విభాగములను మీరు చక్కగా అభివృద్ధికి తెప్పించాలని నేను ఆశిస్తున్నాను. వారిరువురూ ఆనందంగా,ఆరోగ్యంగా ఇంకా ఎక్కువకాలం జీవించాలని నేను ఆశిస్తున్నాను.

**(తేదీ 13.07.2003, గురుపూర్ణిమ, సాయికుల్వంత్ సభామండపం)**

sri sathyasai vachanamrutam